# మ(ధ)ర్మం

"మన దేవ్వన్నా పవిత్రమైన సంబంధమా?" ఎత్తి పొడిచినట్లుగా అడిగింది చంద్ర.

తుపాకీ దెబ్బ తిన్నట్టు చూసేడు రాజేంద్ర!

"నా దిగులు అర్థం చేసుకోండి ... ప్లీజ్" ప్రతిమాలుతున్నట్టుగా అన్నది చంద్ర.

కోపంతో చూసేడీ సారి!

మెల్లిగా రెండడుగులేసి అతని దగ్గర కొచ్చి "కోపమొచ్చిందా!" అని చిరునవ్వుతో అడిగింది.

గభాల్న చంద్రని తన మీదకు లాక్కుని మెడచుట్టూ చేతులువేసి కిందికి జార్చుతూ "నువ్వు ... నా దానివి, మన నెవ్వరూ విడదీయలేరు" అంటూ గాఢంగా అదుముకొన్నాడు.

ఇరువురి హృదయాలూ అల్లరి పెడుతున్నాయి! ఒకరి ముఖం వొకరు అందంగా చూసుకుంటూ కారణమంటూ లేకుండానే మందహాసాలు చేసుకుంటూ కొత్తగా చూసుకొంటున్నారు. వారిలో కోర్కె, ఆదుర్దా సమస్తం వొదిలి యేకమయ్యే ఆనందం... ప్రపంచాన్ని మరచిపోయేరు! ఊపిరాడకుండా, బలం మిగలకుండా, గుండెల్ని పిండేసే సుఖంతో మెలికెలు తిరిగిపోతూ స్వర్గపుటంచుల్ని చేరుకొంటున్నారు.

చీకటి వారి మధ్య సిగ్గుపడతూ నలిగిపోతోంది.... కాలం చిలిపిగా పరుగు తీస్తోంది!

"ఆయనొచ్చే వేళయిందే!" నసిగింది చంద్ర.

"రానీ భయమేం వుంది?" నిర్లక్ష్యంగా అన్నాడు రాజేంద్ర.

"అమ్మో!,... ప్లీజ్" ప్రతిమాలింది.

చంద్ర ఆందోళన గమనించిన రాజేంద్ర "సరే.... రేపింకా పెందరాళే వొస్తాను!" అంటూ లేచేడు.

o o o o

"టక్... టక్... టక్" తలుపు చప్పుడయింది.

బద్ధకంతో లేవబుద్ధి కాక పక్క మీద అటూ యిటూ దొర్లుతున్న చంద్ర బలవంతంగా లేచి విసుక్కుంటూ తలుపు తీసింది.

ఎదురుగా నిల్చొన్న తమ్ముణ్ణి చూస్తూనే ఆమె బద్ధకం, విసుగు ఒక్కసారే పారిపోయి-ఆస్థానంలో ఆశ్చర్యం చోటుచేసుకోగా "నువ్వా శేఖరం!!"

## గొరావర్జుల దీపక్ కుమార్

అంది.

చిన్నగా నవ్వుతూ చేతిలోని సూట్కేసు మరో చేతిలోకి మార్చుకున్నాడు.

"దారి తప్పి వొచ్చి నట్టున్నావే!'' అన్నది మళ్ళీ.

"నన్ను ఇంట్లోకి రానివ్వవా?!" అను మానంగా అడిగేడు శేఖరం.

"ఓహ్... సారీ.. దా... దా" అంటూ అడ్డు తొలిగింది.

"ఎన్నాళ్ళకిరా మళ్ళీ నిన్ను చూడ్డం! అమ్మా నాన్నా ఎలా వున్నారు?'' అంది

"బాగానే వున్నారక్కా... ఇంతకీ బావేడీ?" అడిగేడు.

"అయనింకా లేవలేదుగానీ..., వచ్చే ప్పుడు ఉత్తరమ్మొక్కయినా రాయలేక పోయావుట్రా!''

"టైమెక్కడే! .. అదీగాక నేనసలు బైల్దేరతాననికూడా అనుకోలేదు!" అంటూ సోఫాలో కూలబడ్డాడు.

"ఆగు... కాఫీ తెస్తాను" అంటూ లోపలికి నడస్తున్న చంద్రని అనసరిం చేడు శేఖరం.

"ఇంటర్వ్యూ వుందక్కా... తొమ్మి దింటికల్లా వెళ్ళిపోవాలి!'' అసలు విష యం చెప్పేడు.

"అదా సంగతీ....ఊరకరారు మహా త్ములు!...." అని నిష్ఠూరమాడి వెంటనే "టిఫిన్ చేసి వెళ్తావా?....ఏకంగా భోజ నమే చేసేస్తావా?" అంది.

"అనలేం వొద్దు ...కాఫీయే తాగి వెళ్తాను....,రైలు ప్రయాణం .. .చాలా అలసటగా వుంది" అన్నాడు శేఖరం.

○ ○ ○

రోజూ వచ్చే వేళకన్నా-అరగంట ఆలస్యంగా వచ్చేడు రాజేంద్ర!

ఆలస్యమెందుకయిందో అడగలేదు చంద్ర! ఎందుకంత లేటయిందో వివ రించలేదు రాజేంద్ర!

అసలా ధ్యాసే లేదు వారిద్దరికీ!!

కదలకుండా ఒకచోటే కూర్చొని వున్నా-వారి మనస్సులు కోణార్క శిల్పాల మధ్యకంచి ...ఏటి వొడ్డున చెట్టా పట్టా లేసుకొని యిసకలో నడుస్తూ....వెన్నెల వానలో జలకాలాడుతూ - ఒకరి సౌంద ర్యం మరొకరు కళ్ళతో తాగేస్తూ నిషా లోకి జారిపోయేరు!

త్వరగానూ కాదు.... ఆలస్యంగానూ కాదు-కాలం నిమిషాల్ని మింగేస్తోంది!

"కూల్ డ్రింక్ తెస్తా నుండండి" అంటూ లోపలికెళ్ళింది చంద్ర....ఒద్దం టున్న రాజేంద్ర మాటల్ని పట్టించు కోకుండా!

చంద్ర అందిస్తున్న గ్లాసు నందుకొని పక్కనే వున్న టీ పాయ్ మీద పెట్టి చేతి లోని పూలపొట్లం అందించేడు.

అందుకోబోతున్నదల్లా ఒక్కవూపున రాజేంద్ర వొళ్లో పడింది—అతను తమా షాగా లాగిన కుదుపుకి!

"ష్... తలుపు!" హెచ్చరించింది ఛటుక్కున లేస్తూ!

"ప్చ .. సెన్సార్" నవ్వేసేడు రాజేంద్ర.

"మీ కెందుకంత యిది....నేనంటే!" అంటూ ఎదురుగావున్న సోఫాలో కూర్చుంది.

"ఇది....అంటే!" ఒత్తి పలికేడు.

"అదే...." సిగ్గుపడింది తల్లో పూల చెండు తురుముకొంటూ.



తుఫాన్‌లా ప్రవేశించేడు శేఖరం!

ఉలిక్కిపడ్డాడు రాజేంద్రని చూస్తూనే! ఉత్తర క్షణం ఏం మాట్లాడాలో తెలియక అయోమయంగా చూస్తూ క్షణంలో అరవయ్యోవంతు సమయంలో "కాఫ్ఫి కడక్కొస్తా!" అంటూనే లోపలికెళ్లి పోయేక

"అతనెవరు?!" వెంటనే అడిగేడు రాజేంద్ర

"తమ్ముడు ఏదో ఇంటర్వ్యూ వుందంటూ పొద్దున్నే వొచ్చేడు" మామూలుగా చెప్పింది చంద్ర

ఒక్కక్షణం నిశితంగా చంద్ర ముఖంలోకి చూసి "వెళ్తానింక" అంటూ రెండంగల్లో రోడ్డుమీద కెళ్ళి పోయేడు-కూల్‌డ్రింకయినా తాగకుండానే!

ఎందుకో అటే చూస్తున్న చంద్రని అడిగేడు శేఖరం! "ఆయనప్పుడే వెళ్ళి పోయేరే!"

"పనేవున్నా వుందేమో!" అన్నది

"ఆయన మీకు బాగా తెలిసినవారిలా వున్నారే!?" సందిగ్ధంగా అడిగేడు శేఖరం

"ఔను ఫామిలీఫ్రెండు యేం?" అనుమానంగా అన్నది

"ఆయన్నాకు పొద్దున్న ఇంటర్‌వ్యూ చేసిన ఆఫీసరక్కా" చిన్నగా నవ్వుతూ చెప్పేడు

'అంతేకదా!' అనుకుంటూ లోపలికి నడిచింది చంద్ర

వెంటబడ్డాడు శేఖరం-తనకా ఉద్యోగం వొచ్చేట్టు రికమెండ్ చెయ్యమంటూ!

శేఖరం గోడుని వినదల్చుకోలేదు చంద్ర - దాంతో బలవంతంగా ఆమె మాడుని గోకి మెదడలోకి ఎక్కించేస్తున్నాడు!

ఇక లాభంలేదని 'నీ అభ్యుదయ భావాలేమయ్యాయిరా? ఈ సమాజం మారాలంటే యువతచేతిలోనే వుంది, 'ప్రతి వొక్కర్లో సోషల్‌సెన్స్ రావాలి చైతన్యం రావాలి' అంటూ అందరూ నిన్నే అనుసరించాలి అన్నంత ఆవేశంతో వుపన్యాసాలిచ్చేవాడివి! అన్నట్టు మెన్నా మధ్య అన్యాయాలేవో జరుగుతున్నాయని అంటూ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్‌ముందు ధర్నా కూడా చేయించినట్టున్నావే! ఇదేనట్రా నీ ఆశయం? ఇదేనా నీ ఆదర్శం?!" అంటూ నిలేసింది

"అక్కా ఆవన్నీ ఇప్పుడెందుకు! ఇప్పటికే ఎమ్మే చదివి నాలుగేళ్ళయింది ఇంకా కూడా ఉద్యోగం దొరక్కపోతే నా బతుకింక అకలిరాజ్యమే!" అంటున్న శేఖరాన్ని చూసి విషాదంగా నవ్వుకుని "ఇంకా సంగతి వొదిలేసెయ్యి పద అలా బయటికెళ్లొద్దాం!" అంటూ టాపిక్ మార్చింది


'బావొచ్చేస్తారేమో!?' అనుమాన పడ్డాడు

"ఆయనిప్పుడే రారు నీకా అనుమానం అక్కర్లేదు!" హామీనిచ్చింది

'వద్దక్కా, పొద్దున్నొచ్చినప్పుడెటూ ఆయన్తో మాట్లాడ్డం కుదర్లేదు! ఒకవేళ వనం వొచ్చేప్పటికి లేటైపోయి, ఆయనొచ్చేసేసి ... బాగుండదు" ఇబ్బందిగా అన్నాడు.

"సరే నీ ఇష్టం," అనేసి ఊరుకుంది

ఆమాటా, యీమాటా మాట్లాడుతూ, టిఫిను, కాఫీ, భోజనం ఇత్యాదులన్నీ




అయ్యేసరికి తొమ్మిది గంటలయింది, మాధవరావు రాక కోసం నిరీక్షిస్తూ. ఏదో పుస్తకం చదువుతూ కూర్చున్నాడు శేఖరం.

పక్కనే సోఫామీద కూర్చొని జ్ఞాపకం వొచ్చినప్పుడల్లా యేదేదో అడుగుతోంది చంద్ర.

పదింటివరకూ కాలం గడిపేసి నిద్ర కుపక్రమించింది చంద్ర.

అక్షరాలు గజిబిజిగా మారిపోయి.... పుస్తకం అటూ యిటూ వూగిపోతూ నెమ్మదిగా జారి పోయింది. రైలుప్రయాణపు బడలికను సుఖ మెరక్కుండా తీర్చుకొంటూందిప్పుడు శేఖరం శరీరం!

తేదీ మారింది!.... తెల్లవారింది!.... లోకం వెలుగులోకి వొచ్చి చాలా సేపయింది!

కళ్ళుతెరచి గభాల్న లేచి కూర్చున్నాడు శేఖరం! ఏమీ అర్థంకాక అయోమయంగా గడియారంవంక చూసేడు.... పదకొండున్నర!!

"అక్కా"....అని అరిచేడు.

"లేచేవ్రటా!" అంటూ వాకిట్లోంచి వొచ్చింది చంద్ర.

"ఇంత సేపూ లేవలేదే!?" అడిగేడు.

చిరునవ్వుతో...."లే, స్నానం అదీ కానిచ్చేయ్.... తొరగా భోంచేసేద్దూ గాని," అనేస్తూ అక్కణ్ణించి కదిలింది— చంద్ర.

"బావెళ్ళి పోయేడా?" లేవబోతూ అడిగేడు.

"ఆహాఁ" లోపల్నుంచే అన్నది-చంద్ర.

మాధవరావుని కలవలేక పోయానన్న బాధతో "ఛి ...నాకు బుద్ధిలేదు". అనుకొంటూ తల కొట్టుకున్నాడు.

○ ○ ○ ○

సాయంత్రం ఆరుగంటలయింది.

రోజూ రాజేంద్ర వొచ్చే టైమది. చంద్ర కారోజు రాజేంద్ర రావటం ఇష్టం లేదు! శేఖరం అలా రోడ్డుమీదికెళ్ళేడు "ఇప్పుడేవస్తా" నంటూ ! అలవాటుగా వచ్చేసేడు రాజేంద్ర!

'రాకూడ'దని అనుకుంటున్న చంద్ర.. రాజేంద్రని చూస్తూనే ఇబ్బందిగా ఫీలయింది!

"బావున్నారా?" అని అడిగిన కుశల ప్రశ్న ఆమెకే ఎబ్బెట్టుగా అనిపించింది.

చంద్ర ముఖంలోని భావాల్ని తేలిగ్గా

అర్థం చేసుకున్నాడు రాజేంద్ర!

ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

"శేఖరం వొచ్చేలోపల రాజేంద్ర వెళ్ళిపోతే బాగుండు!" అనుకుంటూంది చంద్ర.

చంద్రకి తను 'రాకూడదనుకుంటూనే ఒచ్చేసినట్టు' తెలియనివ్వకూడదని విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు రాజేంద్ర!

"ఇప్పుడే వొస్తానుండండి," అంటూ లోపలికెళ్ళింది చంద్ర.

అయిష్టంగా ఏదో వీక్లీ తిరగేస్తూ కూర్చున్నాడు రాజేంద్ర.

"అక్కా...." అంటూ దూకుడుగా వచ్చిన శేఖరం, రాజేంద్రని చూస్తూనే తత్తరపడుతూ అప్రయత్నంగా రెండు చేతులూ జోడించేసి "నమస్కారమండి" అన్నాడు.

"రావోయ్, నేను ఈ మాట చెప్పి పోదామనే వచ్చేను, నువ్వొచ్చి రేపు డ్యూటీలో జాయినయిపోవచ్చు." మందహాసం చేస్తూ అన్నాడు రాజేంద్ర.

సంతోషంతో ముఖం చాటంతయింది శేఖరానికి.

"థాంక్యూ సర్.... మీ మేలు యీ యీజన్మలో మర్చిపోలేను."

కృతజ్ఞత ఉట్టిపడింది శేఖరం కంఠంలో.

"అంతంత పెద్దమాట లెందుకోయ్...." నవ్వబోతున్న రాజేంద్ర తక్షన ఆగిపోయాడు - కాఫీకప్పుతో ప్రత్యక్షమైన చంద్రని చూసి!

రాజేంద్రకోసం టీపై మీద వోకప్పుని పెట్టి...."ఇదిగో .... తీసుకోరా" అంది శేఖరం వైపు తిరిగి.

"ఇప్పుడే వస్తానక్కా కాస్త మొహం కడుక్కొని...." అంటూ బాత్రూమ్‌వైపు నడిచేడు శేఖరం.

"నా కోసం ఇస్తున్నారా వాడికీ వుద్యోగం?" సీరియస్‌గా అడిగింది.

మాట్లాడలేదు రాజేంద్ర.

"నాకోసం మాత్రం వాడికా వుద్యోగం యివ్వద్దు.... నాకది యిష్టంలేదు." వీలయినంత సౌమ్యంగా చెప్పాలనుకొన్నా తనకే తెలియని గంభీరత కన్పించింది చంద్ర స్వరంలో!

"ఎంత అమాయకురాలివి చంద్రా.... నువ్వు నాపై చూపిస్తున్న ప్రేమాభిమానాలకు నేనేం చేసినా తక్కువే....నా చర్మంతో చెప్పులు కుట్టించినా....నీకోసం, తప్పు లేదు. నీకోసం నేను చేసింది చాలా తక్కువ చంద్రా...." బాధగా రాజేంద్ర మనస్సు మూలిగింది.

టవల్తో ముఖంతుడుచుకొంటూవచ్చేడు శేఖరం.


"వెళ్తానింక" అంటూ లేచాడు రాజేంద్ర.

మౌనంగా అక్కడనుంచి వెళ్ళిపోయింది చంద్ర.

"కూర్చోండి.... అప్పుడే వెళ్ళిపోతున్నారే?" అంటున్న శేఖరం మాటల్ని పట్టించుకోకుండా వీధిలోకి నడిచేడు - రాజేంద్ర.

"అక్కా....నీ రుణమెలా తీర్చుకోనక్కా... నీకెలా థాంక్స్‌చెప్పాలోకూడా తెలియట్లేదు". అంటూ చంద్ర కాళ్ళమీద పడ్డాడు శేఖరం.

"ఏవిట్రా ఇది!? లే. లే!" అంటూ బలవంతంగా లేపింది చంద్ర.



"నా కష్టాలన్నీ గట్టెక్కించేవు, నువ్వు నిజంగా దేవతవి. ఎమ్మే చదివి నాలు గేళ్ళయినా యే వుద్యోగమూ దొరక్క" అంటున్న శేఖరాన్ని మాట్లాడనివ్వకుండా "నేనేం చెయ్యలేదు.... అలాంటి పిచ్చి పిచ్చి భ్రమలేం పెట్టుకోవద్దు!" అని శుష్కహాసం చేసింది చంద్ర!

"నేను ఛస్తే నమ్మను....నువ్వు రికమెండ్ చెయ్యందే నాకీ వుద్యోగం రాదు! రాలేదు! రాబోదు కూడాను. నీచేత్తో విదిలించిన...." ఏదేదో చెప్పేస్తున్న శేఖరాన్ని పట్టించుకోకుండా అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది చంద్ర.

o o o o

రోజులు గడుస్తున్నాయి.

ఈ మధ్య రాజేంద్ర అసలు రావట్లేదు! కానీ....సాయంత్రమయ్యేసరికి చంద్ర ఇంట్లోనూ వుండటంలేదు!

అతనెందుకు రావడం మానుకున్నాడో....చంద్ర ఎందుకు ఇంటిపట్టున వుండట్లేదో అర్థంగాక తికమక పడుతున్నాడు శేఖరం.

ఆఫీసునుంచి ఇంటికొచ్చేసరికి పని మనిషే దర్శనమిచ్చి కాఫీయో, టిఫీనో ఇస్తుంది. అవురావున అవి పూర్తిచేసేసి, పనిమనిషిని పంపించేసి ఇక చంద్ర కోసమో, మాధవరావు కోసమో అర్థంగాకుండా వెయిట్ చేస్తాడు శేఖరం. చాలా సేపటికి చంద్రే వొస్తుంది! పలకరింపులు తప్ప చెప్పుకోతగ్గ మాటలేవీ వుండవు ఇద్దరిమధ్యా! మౌనంగా భోజన కార్యక్రమం కానిచ్చేసి, ఎవరి గదుల్లోకి వాళ్ళే పోతారు!

రోజు రోజుకీ టెన్షన్ ఎక్కువయిపోతోంది. 'ఏటుటిదంతా' అని అనుకొంటూ అయోమయంగా గడిపేస్తున్నాడు. ఒకసారి కుండ వగులగొట్టినట్టు అడిగేసేడు శేఖరం!

అగ్గిమీద గుగ్గిలమైపోయింది చంద్ర! రుద్రకాళిలా...."నీ కవన్నీ అనవసరం! నువ్విక్కడికొచ్చింది ఉద్యోగం వెలగబెట్టుకోడానికేనని జ్ఞాపకం పెట్టుకో!, ఇంకెప్పుడూ నా సొంతవిషయాల్లో తలదూర్చొద్దు" అంటూ కటువుగా అరిచేసింది.

ఖంగు తిని మొహం వేళ్ళాడేసుకుని "నాకెందుకిదంతా...." అని స్వగతంగా అనుకొన్నా,.... 'నాక్కాకపోతే మరెవరి

క్కావాలి?'....ఏదన్నా వుంటే దాన్నడ్డం పెట్టుకుని ప్రమోషనయినా కొట్టచ్చుగా!!' అని ప్రకాశంగా తనలో తనే అనుకొన్నాడు శేఖరం.

○ ○ ○

తూర్పు ముఖం ఉరేసుకున్నవాడి కంఠంలా కందిపోయింది! ఆత్మహత్య చేసుకున్నవాడి కోర్కెల్లా కిరణాలు పరుచుకుంటున్నాయి !! చచ్చినవాడి బంధుమిత్రుల్లా పక్షులు ఘొల్లుమంటున్నాయి!!!

"శేఖరం సీరియస్ స్టార్ట్ ఇమ్మీడియట్లీ." టెలిగ్రామ్ చూసి అదిరిపడ్డాడు పరంధామయ్య.

"ఒసేవ్....వర్ధనీ." గావుకేక పెట్టేడు.

"శేఖరానికేదో అయ్యిందే, .... నా బాబుకేదో అయిపోయిందే...." అంటూ మొదలెట్టిన అతని హడావుడికి, వర్ధనమ్మ గుండెలు బాదుకోడంకూడా జతగూడే సరికి కంగారుపడుతూ ఊరువూరంతా ఏకమైపోయింది. చాలక, .... చందాలు పోగుచేసి మరీ రైలెక్కించేసారు!

తీరా రైలు దిగి స్టేషన్లో కడుగుపెడుతూనే శేఖరం ఎదురయ్యేడు!

○ ○ ○

"ఇదిగో మీ కూతురు...., దీన్ని మీరేం చేసుకుంటారో నా కనవరం! దీంతో చస్తే కాపరం చెయ్యలేను!" కర్కశంగా అన్నాడు మాధవరావు.

"అదేవిటి బాబూ, యేంజరిగింది!?!" గాభరా....గాభరాగా అడిగేడు పరంధామయ్య!

"మా వల్లేమయినా తప్పు జరిగితే క్షమించు నాయనా ...." అర్థించింది వర్ధనమ్మ

"తప్పు జరిగింది మీ వల్లయితే నాకే బాధాలేదు. అంతా ఇదిగో దీని వల్ల....... అమ్మో మ్మో....ఇది ఇలాంటిదని కల్లో కూడా అనుకోలేదు!?" పళ్లు కొరుకుతూ అరిచేడు మాధవరావు.

"అసలేం జరిగింది బాబూ!" అయోమయంగా అడిగేడు పరంధామయ్య.

"నా కొంప ముంచిందీ ముండ...." అంటూ మొదలెట్టి గొడవగొడవగా ఏదేదో అనేస్తున్న మాధవరావుని ఒదిలేసి "ఏం; జరిగిందో నువ్వయినా చెప్పరా?" అంటూ శేఖరాన్ని అడిగేడు పరంధామయ్య.

"నా నోటితో నేను చెప్పలేను నాన్నా!"

"విషయ మేమిటో చెప్పకుండా యేవిటీ రాద్ధాంతం అల్లుడూ!" చనువుగా అన్నది వర్ధనమ్మ.

"ముందా సంబోధన మార్చండి, యేనాడు మీకూతురుకి మొగుణ్ణి కాకుండా పోయేనో, అప్పుడే మీతోకూడా చుట్టరికం తెగిపోయింది !" ఎగిరిపడ్డాడు మాధవరావు.

"ఏమిటే యిది!? ...ఏం జరిగిందే?" చంద్రని అడిగేరు పరంధామయ్య వర్ధనమ్మలు ఒక్కసారే !

కసాయి వాడిముందు గొర్రెలా చూసింది చంద్ర-కాని, నోరు మెదపలేదు !

"ఏం జరిగిందో ఎవ్వరూ చెప్పక పోతే యెలాచచ్చేది !" అసహనంగా




అరిచేసేడు పరంధామయ్య.

"ఏం జరిగిందా!...నేనే చెప్తాను... నీ కూతురు మరో వెధవ్ని మరిగింది! వాడితో నా యింట్లోనే రంకు సాగిస్తుంటగా కళ్ళారా చూసేను! దానికి సాక్ష్యం అదుగో నీ కొడుకు!....అయినా ఇలాంటి తడిగుడ్డల్తో గొంతులు కోసే భ్రష్టురాల్ని ఒదిలేయడానికి, సాక్ష్యాలూ, ఆధారాలూ కూడా అనవసరం.

"నిజమేనా ఇది?!" దిగ్భ్రాంతిచెందేరు ఇద్దరూ!!

"ఔను బావ చెప్పింది నిజం!!" అని శేఖరం వత్తాసు రాకపోయినా అతని భావాన్ని చదవగల్గేడు పరంధామయ్య.

"ఏమిటే ఇది!....నీకేం తక్కువయిందే? ఎట్నుంచి యేడుతరాలుచూసినా ఎక్కడా లేదుగదే! ఎలా నీ కబ్బిందే ఛండాలపుదానా! బుగ్గలు నొక్కుకుంది వర్ధనమ్మ.

"పాపిష్టి ముండా! నా కడుపున చెడబుట్టావే, అంత వొళ్లు కొవ్వెక్కిపోయిందిటే నీకు!....నిప్పులు కడుక్కున్న వంశానికే నిప్పు పెట్టేవుగదుటే భ్రష్టురాలా, ...నువ్విలా చేస్తావని, ఇంత అప్రతిష్ట తెస్తావని తెలిసుంటే అష్ట కష్టాలూ పడి నీ పెళ్ళి చెయ్యకపోదును గదుటే!... నీ మెడకో రాయి చుట్టి యే బావిలోకో తోసేసుండేవాణ్ణి,....నీలాంటి కూతురుండడంకన్నా చచ్చింది మేలు,... నువ్వు చస్తే ఒక్కొద్దేడ్చి అనల్నాకు కూతురే పుట్టలేదనుకుంటాను! ఛీ..ఛీ.. నీ మొహం చూస్తేనే పంచమహా పాతకాలూ చుట్టుకొంటాయి....ముండనష్టపు ముండా, జేష్టముండా" అవమాన భారంతో కుంచించుకుపోతూ అన్నాడు పరంధామయ్య.

"బాగా అయ్యింది....చాలా బాగా అయ్యింది! ఆడపిల్లే వంశగౌరవాన్ని కాపాడుతుందంటూ........ విచ్చలవిడిగా స్వేచ్ఛనిచ్చేసి....గారాబంగా పెంచేసినందుకు....మీకు తగ్గట్టే శాస్తిచేసింది! ఇప్పుడింక అఘోరించండి! ఏ యేట్లో దూకి చస్తారో తేల్చుకోండి!

ఇందుకుటే నువ్వారోజు నీ సంసార గొడవలు పట్టించుకోవద్దందీ? నాకెప్పుడో అనుమానం వొచ్చిందే......అందుకనే

బావని ఆఫీసుకెళ్ళి మరీ పిల్చుకొచ్చేను! ఇదిగో నువ్వు సాగిస్తున్న సంసారం!? .. ఇదన్నమాట నీ అసలుసంగతి....నువ్వు అక్కవి కాదే....కుక్కవి... ఛి....డర్టీ బిచ్....అసలు...."

"స్టాపిట్! మరొక్కమాట అన్నావంటే పీక పిసికేస్తాను!... ఏమిట్రా నువ్వు కూసింది? నేను చేసింది వ్యభిచారమా?....నేను బిచ్‌నా? ఒరేయ్....నేను చేసేదే వ్యభిచారమైతే....మరి నువ్వు చేసేదేంవిట్రా?! గొప్పగొప్ప ఆదర్శాలు వల్లించే వెధవ్వి....మరి నావల్ల నీకొచ్చిన ఆ వుద్యోగమెలా చేస్తున్నావురా చవటా? అసల్నీకు వ్యభిచారమంటే అర్థం తెలుసుట్రా?

నువ్వే కాదురా....యీ సంఘంలో వున్న ప్రతీ యువకుడూ, వూళ్ళోవాళ్ళ విషయానికొస్తే ఆదర్శవాదే!, తనదాకా వస్తే మాత్రం అందరూ నీలాంటి మలపలే....

అసల్నీకు ఏం తెలునని మాట్లాడుతున్నావురా?"

"నోర్మయ్....చేసిన నికృష్టపు పని చాలక యింకా వాడిమీద తిరగబడుతున్నావా?" అరిచేసేడు పరంధామయ్య.

"ఔన్నాన్నా...నేనుచేసింది నికృష్టపు పనే....కాని, అలాంటి పని ఎందుకని చెయ్యాల్సొచ్చిందో ఆలోచించేరా ?.... మీ కవి అక్కర్లేదు!

ఇంక వీరు....ఇప్పటిదాకా నా మొగుడు....వీరికిలేని వ్యసనం లేదు;.... ఒక్క ఆడవాసన తప్ప! అదీ వో నియమం అంటూ కాదు ! అసలా అవసరమే లేదు గనక!

గుండెల మీది బరువుని తీసేసుకునేందుకు ఎవడ్నో వొకణ్ణి తీసుకొచ్చి కట్టబెట్టేసి చేతులు దులిపేసుకోడమే ముఖ్యమనుకొన్నారు కాని...., వాడసలు 'కనీసం సంసారాని కయినా పనికొస్తాడా!....అన్నది ఎవ్వరూఆలోచించరు. ఏం? యింత డైరెక్టుగా అనేసేననా మీ మొహాల్లో అంత అసహ్యం ఒక్కపెట్టున కమ్ముకుందీ!?

చేతగానివాడు కూడా తన పెళ్ళాం పవిత్రంగా వుండాలని కోరుకుంటాడని ఇవ్వాళే తెలిసింది.

ఒక ఆడదాన్ని 'పతిత'అనిచూపించడానికి వేలకువేల చేతులు లేస్తాయి– కాని ఒక్క మొగాణ్ణి భ్రష్టుడు అని చూపించడానికి, ఎవరిదీ.... ఆఖరికి ఒక్క ఆడదాని చెయ్యి కూడా లేదు!

నాకీ సంఘం, కట్టుబాట్లు యేవీ అక్కర్లేదు! నాకెవ్వరూ యేమీకారు!! నేనెవరికీ యేమీ కాను!!!

మీకే సంసారానికి పనికిరాని మొగుడే దొరికుంటే యేంజేసుండేవారు వర్ధనమ్మగారూ?

మీ కసలు సంసారానికి పనికిరాని భార్య దొరికుంటే మీరేంచేసుండేవారు పరంధామయ్యగారూ?

మీరూ నాలాగే చేసుండేవారేమో!!!.. అందుకు మీ అంతరాత్మ ఒప్పుకున్నా వొప్పుకోపోయినా.... మీ రెవ్వరూ చెయ్యలేని పనిని చేసినందుకు నేనేం సిగ్గుపడట్లేదు !

అయినా యీ చేతగాని, పనికిరాని వెధవ నద్నొదిలేసే దేవింటి?!........నేనే వాణ్ణొదిలేస్తున్నాను!". ★